ఈవారం కథ

# బెస్ట్ ఫ్రెండ్

టి.వి.పద్మావతి

పెద్ద వేపచెట్టు అరుగు దగ్గర ఆగిందా బస్సు. "బుడంగుంట.. బుడంగుంట" కండక్టర్ కేక వేస్తుంటే ఒక్కొక్కరే దిగుతున్నారు. చివరగా దిగింది నేనే.

అరుగు ప్రక్కన ఖాళీ స్థలంలో గెనిప గెడ్డల బళ్ళు రెండు ఆగివున్నాయి. అల్లంత దూరంలో ఉన్న మంచినీళ్ళ బావి గిలకలు కిర్రు కిర్రు మంటున్నాయి.

అరుగు మీద బార్లా కూచున్న పెద్దవాళ్ళు నన్ను గుర్తించటానికి ప్రయత్నిస్తుంటే – అలవోకగా పైట సర్దుకుని శివాలయం ప్రక్క వీధిలోకి నడిచాను.



గుర్తుతెచ్చుకుంటూ జాగ్రత్తగా నడిచి 'అవునా? కాదా?' అని ఆ ఇంటి ముందు ఆగాను. తులసికోట చూశాక నమ్మకమైంది. మరి ఆలోచన లేకుండా నేరుగా ఇంట్లోకి నడిచాను.

నన్ను చూసి కెవ్వుమంది కాత్యాయని.

చేతిలో వున్న పుస్తకం ప్రక్కన పడేసి ఒక్క పరుగున వచ్చి కావులించుకుంది.

"వొదలవే తల్లీ. నా మొగుడు కూడ నన్నింత గట్టిగా కావులించుకోలేదు" అన్నాను.

"మొగుళ్ళకేం తెలుసే. ఏమైనా తెలిస్తే మనకే తెలియాలి. అది సరేగాని ఏమిటీ రాక? నన్ను చూడాలని వొచ్చావా?" అమాయకంగా అడుగుతుంటే కళ్ళు చెమ్మగిల్లాయి.

"అవునే కాత్యా! కేవలం నిన్ను చూడాలని, శివాలయం స్తంభం దగ్గర కాసేపు కూచోవాలని వచ్చాను."

"ఇప్పటికి" అంది.

"ఇరవై ఏళ్ళ తర్వాత" అని చిన్నగా తలవూపాను.

ఇరవై వసంతాలు నడిచిపోయాయిగాని నా మనసులో మాత్రం మొన్నీ మధ్యలా వుంది. ఆ గౌరవ మర్యాదల నుంచి, బిజీ లైఫ్ నుంచి ఎప్పటికప్పుడు పారిపోయి మేకప్‌లేని నా బాల్యమిత్రుల దగ్గరకు, బాల్యం బంగారులా నడిచిన ఈ వూరికి రావాలని అనుకోనిది ఎప్పుడు? నిత్యం మనసులో కదలాడుతూ వుండబట్టే ఇన్ని వసంతాలు నడిచిన జ్ఞానమే లేకపోయింది.

"ఏమిటోయ్! ఎక్కడికో వెళ్ళిపోయావ్. ఇల్లు గుర్తుపట్టేవా? ఎవర్నైనా అడిగేవా?"

"ఎవర్నీ అడగలేదు."

"బతికించావ్. లేకుంటే చూయించటానికి వచ్చిన వాడు కాస్తా నిన్నొదిలి వెళ్ళేవాడే కాదు."

"వయసొచ్చినా మాటలు తగ్గలేదే"

"వుండు. కాఫీ కలుపుతా" వంట గదిలోకి జంప్ చేసింది.

ప్రక్కనే పడివున్న పుస్తకం చూశాను.

"చిలకమర్తివారి ప్రహసనములు" ఆ పుస్తకం చూడగానే నా పెదాలు విచ్చుకున్నాయి. ఎన్నిమార్లు చదువుకుని ఎంతగా నవ్వుకున్నాం.

"ఈ పుస్తకం వొదలలేదటే" వంట గదిలోకి వెళ్ళి అడిగాను.

"ఎట్లా వొదులుతానే. పంతులు ముండావాడు అంత గొప్పగా రాస్తేనూ" అని దీర్ఘం తీసింది.

నిజమే. చిలకమర్తివారు ఎంత గొప్పగా, హాయిగా రాశారు. తెలుగు వొయ్యారం. అందం ప్రతిపదంలో కనిపిస్తుంది. ఇప్పుడున్న చచ్చు (అర్థంకాని) కవిత్వం, చెత్త కథలు ఇందులోని ఒక్క అక్షరానికి సాటి వొస్తాయా?

నా చేతిలో పుస్తకాన్ని లాక్కుని, భద్రంగా బీరువాలో పెట్టి వచ్చి–

"అది వుంటే నేను కనిపించనుగానీ, కాఫీ లాగించు" చెరో కప్పు అందుకున్నాం.

"పెద్దగా మార్పులేదు" అన్నాను సాలోచనగా.

"కాఫీనా?"

"కాదు. ఊరు."

"ఎందుకు లేదు తల్లీ. గుడిసెలు మిద్దెలైనాయి. గూడుబళ్ళు బస్సులైనాయి. స్కూటర్లు వొదిలిన గాలి వూళ్ళో తేలుతుంది. అయినా వూరు మారలేదే పద్మ. మన శివాలయం, పెద్ద వేపచెట్టు అరుగు, పంటకాలువ, చెరువు, మర్రిచెట్టు, దాని ప్రక్కన పోలేరమ్మ గుడి... అవి చూస్తుంటే వొళ్ళు ఝల్లుమంటుంది. వొళ్ళు తెలీకుండా ఆడిన ఆటలే చరమాంకంలో తీపి జ్ఞాపకాలు. నాకు అనిపిస్తుంది – అప్పుడే మన జీవితం అయిపోయిందా? అని."

దాని మాటలు వింటుంటే బాల్యం కళ్ళముందు నిలిచింది.

ఎన్ని ఆటలు! ఎన్ని పండుగలు.

ఇప్పుడు పండుగ వచ్చిందీ తెలీదు. వెళ్ళిందీ తెలీదు.

శివరాత్రి రాత్రి, ఉగాది పగలు చూడాలి మా సంబరం.

ఇంట్లోవాళ్ళు తిట్టినా, కొట్టినా ఆ రాత్రి హరికథలు వొదులుతామా? ఆడి ఆడి మంచినీళ్ళు తాగడం. హరికథ దగ్గర కూచోటం. లేచి మళ్ళీ ఆడుకోటం. ఉగాది అయితే మరి చెప్పవలసిన పనిలేదు. ప్రొద్దుటే లేచి పెద్ద వేపచెట్టు దగ్గర కాపువేసేవాళ్ళం. బ్రతిమాలో, చేతిలోవి లాక్కొనో, దొరికినంత వేప పూత సంపాదించేవాళ్ళం. మల్లిబాబు మామిడితోట దగ్గర మాటువేసేవాళ్ళం. కనుమూసి తెరిచే లోపు పుల్లమామిడి కాయల్తో లగో లగు. శివాలయంలో కూచొని తిన్నన్ని తిని నోరు పులుపెక్కాక ఇళ్ళకు వెళ్ళి మిగిలిన కాయలు, వేప పూత ఇచ్చి బాగా చీవాట్లు తినేవాళ్ళం.

"కాత్యా! అవన్నీ చూడాలని వుంది" అన్నాను దాని భుజం చుట్టూ చేతులు వేసి.

"పనిగట్టుకుని అవన్నీ చూస్తుంటే మనకు పిచ్చిపట్టిందని వూరంతా మన వెనకాలే వస్తుందిగాని... శ్రీవారు రాగానే ఇంటి బాధ్యత ఆయన నెత్తి మీద పెట్టి మనిద్దరం యశోద దగ్గరకెళ్దాం. దాని ఇంటికి వెళ్ళే దారిలో అన్నీ చూడొచ్చు."

"ఎవరు? ఆ చీమిడి ముక్కుల్దా!" అన్నాను నవ్వుతో.

"ఇప్పుడామాట అనేవ్. దాని మొగుడు వొదిలేస్తాడు."

పకపకా నవ్వేశాను. కళ్ళలో నీళ్ళు నిలిచాయి. ఇంత గట్టిగా, హృదయపూర్వకంగా నవ్వే అవసరమే లేకపోయింది ఇన్నాళ్ళు.

* * *

ఊరు చల్లబడింది. నా మనసు కూడా చల్లబడింది.

చిరుసంధ్యా సమయంలో – కాత్యా, నేనూ ఇద్దరం బయల్దేరాం. నాకైతే బాల్యంలోకి వెళ్ళినట్లే వుంది. మనసు తెలీని ఆనందంతో, దుఃఖంతో నిండిపోయింది. మధ్యలో కాత్యా అన్నీ చెప్తూంది. ఎప్పుడు ఎలా ఆడిందీ, వెన్నెల రాత్రులు దొంగాట ఆడుతుంటే తనకు తేలు కుట్టిందీ అన్నీ చెప్తుకుంటూ పోతూంది. మాటల్లోనే మర్రిచెట్టు వచ్చింది.


నాకు సైగ చేసి, పిల్లిలా ఆ ఇంట్లోకి దారి తీసింది కాత్యా.

వెనకనే నేను.

బియ్యంలో రాళ్ళు చూసుకుంటూంది యశోద.

కాత్యాయనిని చూసి నవ్వి, నన్ను గుర్తించటానికి కాసింత తంటాలుపడిన దాని పెద్ద కళ్ళు ఆశ్చర్యంతో మరింత పెద్దవైనాయి.

"ఇప్పుడు చూడవే. ఎంత బావుందో" అంది కాత్యాయని.






'రానిక నీ కోసం...'

అతడి దృష్టి కార్తీక దీపం
సాహితీ సృష్టి అపురూపం

మలయసమీరంలా మనోహరంగా తాకే శైలి - వాగ్విన్యాసంతో పరిపుష్టమైన శిల్పం అతని సృజనకు అమరిన సహజ ఆభరణాలు. సెంటిమెంట్ అతనికి చాలా ఇంటిమేట్.

భాషా వైభవం, భావనా ప్రాభవం మన కళ్ళను అతని రచన నుంచి కదలనివ్వక కట్టేస్తాయి.

*

కొమ్మనాపల్లి

కొత్త సీరియల్

దీపావళి సంచికతో ప్రారంభం


"ఏమిటి?" అన్నాను అర్ధంగాక.

"దాని ముక్కు"

ఫక్కున నవ్వేశాను.

అర్థమై యశోద కూడా నవ్వేసింది.

పిచ్చాపాటీలో పడిపోయాం.

యశోద మాట్లాడుతూనే ఏదో ఆలోచనలోకి వెళ్ళిపోతోంది. దాని మనసు పూర్తిగా ఇక్కడ లేదని అర్థమైపోయింది.

ఆ విషయమే అడిగాను.

ఏమీ లేదన్నట్లు చిన్న నవ్వు నవ్వింది.

కాత్యాయని మధ్యలో కల్పించుకుని -

"మొగుడూ మొద్దులూ అన్నీ వొదిలి ఇవాళ రాత్రి డిన్నర్‌కి మా ఇంటికి వస్తున్నావు. ముగ్గురం శుభ్రంగా త్రేన్చి, శివాలయాన్ని ఈ వెన్నెల్లో పావనం చేద్దాం" అంది యశోదతో.

యశోద వీలుపడదన్నట్లు తల అడ్డంగా వూపింద.

కాత్యాయని దాని తలను రెండు చేతులతో పట్టుకుని, "నువ్వు వస్తున్నావు. మేము బయల్దేరుతున్నాం. తిండీ తిప్పలూ రెడీచేయాలి. మరేం చెప్పకు" అని నన్ను లాక్కుని మరీ బయటకు నడిచింది.

దార్లో యశోద విషయం అడిగాను.

"యశోద భర్త నానా హింసలు పెడుతున్నాడు. దాన్ని చూస్తే జాలిగా వుంది. కనపడితే కడుపు చెరువైపోతుందని నేను వెళ్ళటం కూడా తగ్గించాను. కాలమే పరిష్కారం చూపాలి" అంది చిన్న నిట్టూర్పుతో.

అనుకున్నట్లుగానే మరో గంటకల్లా యశోద వచ్చింది.

ముగ్గురం వెన్నెల్లో తులసికోట దగ్గర కూచొని భోజనం పూర్తిచేశాం. తర్వాత ప్రక్కనే వున్న శివాలయంలోకి వెళ్ళాం. తీరిగ్గా నాపరాయి మీద కూచొని చాలా విషయాలు మాట్లాడుకున్నాం.

యశోద మాత్రం కాస్త నిరాశగానే వుంది.

ధైర్యంచేసి అన్నాను.

"యశోదా! భర్త మంచివాడు కాకుంటే విడాకులు ఇచ్చెయ్. నువ్వు చదువుకున్నావు. నీ కాళ్ళ మీద నువ్వు నిలబడగలవు."

యశోద చటుక్కున తల పైకెత్తి ఆశ్చర్యంగా చూసింది.

"కాత్యా! అంతా చెప్పింది" అన్నాను.

యశోద శాంతంగా నా ముఖంలోకి చూసి చిన్నగా అంది.

"భార్యాభర్తల బంధం అంత తేలిగ్గా తెగిపోతుందా పద్మా! మన అన్నదమ్ముడు పొరపాటుగా ప్రవర్తిస్తే సర్దుకోమా... మనిషి స్వతహాగా మంచివాడే. అలవాట్లు మానుకోవాలి. చూద్దాం."

"అది కాదు..." అంటున్న నన్ను మధ్యలోనే ఆపేసి -

"బిడ్డ అడ్డదారిలో పోతుంటే దారిలో పెట్టాలి కదా! భర్త విషయంలో కూడా అంతే. నాకు నమ్మకముంది. దేనికైనా ఓర్పు కావాలి. నేనూ నీలా ఆలోచించాను. అది సరైన మార్గంలా కనిపించలేదు. ఈసారి నువ్వు వొచ్చేసరికి చూడు. ఆయనతో కలిసి డిన్నర్‌కి వస్తాను" అంది దృఢంగా.

దాని విశ్వాసానికి ముచ్చటేసింది.

అంతేకాదు. నా సమస్యకు ఒక విధమైన పరిష్కారం దొరికినట్లే వుంది. మావారి బాధ భరించలేక, ఆ బిజీ లైఫ్ నుంచి, ఆయన్నించీ పారిపోయి ఇలా వచ్చాను. నేను మాత్రం ఎందుకు ప్రయత్నించకూడదు? ఎందుకు మార్పు రాదో చూద్దాం... ఒక వారం రోజులు వుండాలని వచ్చిన నేను రేపే తిరుగుప్రయాణం కట్టాలని నిర్ణయించుకున్నాను.

శివాలయంలో గంట మ్రోగింది.

చిన్న నవ్వు నా పెదాలపై విచ్చుకుంది.

■